క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెదకాకాని: పెదకాకాని సబ్‌స్టేషన్‌లో 11 కేవీ వెనిగండ్ల ఫీడర్ మెయింటెనెన్స్, చెట్లు నరకడం వలన విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వెనిగండ్ల, పెదకాకాని గ్రామాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. విద్యుత్ సరఫరాలో కలిగే అంతరాయానికి ప్రజలు సహకరించాలని విద్యుత్‌శాఖ ఏఈ బత్తుల శ్రీనివాసరావు కోరారు.

పెదనందిపాడు: నేడు మండల కేంద్రం పెదనందిపాడు, మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ అంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం పెదనందిపాడు, వరగాని సబ్‌స్టేషన్‌ల పరిధిలోని విద్యుత్ లైన్లు మరమ్మతుల నిమిత్తం, విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించుట జరుగుతుందని, ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలియజేశారు.

గుంటూరు రూరల్: విద్యుత్ సబ్‌స్టేషన్ల మరమ్మతులు తదితరాల వల్ల నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వినియోగదారులు గమనించాలని విద్యుత్ శాఖ ఏఈ బ్రహ్మయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కేవీపీ కాలనీ, శ్రీనివాసరావుతోట, 60 అడుగుల రోడ్డు, కృష్ణబాబుకాలనీ, జోసెఫ్‌నగర్, కోదండరామయ్యనగర్, కొత్తకాలనీ, కావేరికాలనీ, కామాక్షినగర్, మిర్చియార్డ్‌రోడ్డు, లాలుపురం, ఏటుకూరు, బొంతపాడు, ఆర్ అగ్రహారం, నల్లచెరువు ఇండస్ట్రియల్ ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వినియోగదారులు గమనించాలని తెలిపారు.

ట్రాలీఆటోకు బహిరంగ వేలం



ప్రత్తిపాడు: ట్రాలీ ఆటోకు నేడు బహిరంగ వేలంపాటను నిర్వహించనున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ గీత తెలిపారు. సెబ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రత్తిపాడు సెబ్ స్టేషన్ పరిధిలో గతంలో సీజ్ చేసిన ట్రాలీ ఆటోకు శనివారం ఉదయం పదకొండు గంటలకు స్థానిక సెబ్ స్టేషన్ ఆవరణలో వేలంపాట జరగనుందన్నారు. 2022 రిజిస్ట్రేషన్ ఆటోకు పాట ప్రారంభ ధరను రూ. 2,30,000గా నిర్ణయించడం జరిగిందన్నారు. ఆసక్తి ఉన్న వారు ఎలాంటి ముందస్తు ఫీజులు, ధరావత్తులు చెల్లించే పని లేకుండా నేరుగా పాటలో పాల్గొనవచ్చని గీత చెప్పారు. మరిన్ని వివరాలకు 9440902471, 9885883987 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

గుంటూరు రూరల్: పేకాటరాయుళ్ళను అరెస్ట్ చేసిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం జేకేసీ కళాశాల రోడ్డులో ఒక రియల్ ఏస్టేట్ కార్యాలయంలో గుట్టుచప్పుడు కాకుండా పేకాట నిర్వహిస్తున్నారని సమాచారం మేరకు దాడిచేయగా పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకుని రూ.38,600 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించనున్నట్లు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



పెదకాకాని: పరిసరాలు పరిశుభ్రంగా ఉండటం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని స్కోప్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ డి.కొండలరావు అన్నారు. మండలంలోని నంబూరు యానాదికాలనీలో ఆరోగ్యమే మహాభాగ్యం అనే అంశంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. స్కోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఎన్‌యూ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండటం మనిషి యొక్క ప్రాథమిక హక్కు అన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం, మంచి ఆహారం తీసుకోవడంతో పాటు పిల్లల ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాలనీవాసులకు సహాయ సహకారాలు అందిస్తున్న స్కోప్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమన్నారు. డాక్టర్ వెంకట రమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక ఆరోగ్యం కలిగి ఉండాలి. సమావేశానికి స్కోప్ డైరెక్టర్ డాక్టర్ కొండలరావు అధ్యక్షత వహించారు. ఏఎన్‌యూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ భావనరుషి సహకారంతో పిల్లలకు అల్పాహారం, గుడ్లు, స్వీట్లు, పండ్లు పుస్తకాలు, పలకలు తదితరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాజేష్, స్వరూప్ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

గుంటూరు ఈస్ట్: ఇంట్లో చోరీపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. గణేష్‌రావు వీధికి చెందిన వి.పద్మజకుమారి కుటుంబ సభ్యులతో కలసి రెండు రోజుల కిందట ఇంటికి తాళాలు వేసి ఊరు వెళ్లింది. శుక్రవారం తిరిగి చేరుకుంది. లోపలకు వెళ్లి పరిశీలించగా, సందులో తలుపును దుండగులు బలవంతంగా తెరిచి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువా తాళాలు తెరిచి అందులోని రూ. లక్ష చోరీ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజల ఆరోగ్యానికి రక్ష.. జగనన్న ఆరోగ్య సురక్ష

ఉప్పరపాలెం వైద్య శిబిరంలో ఎంపీడీవో శ్రీనివాసరావు

పొన్నూరు: ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి పొన్నూరు మండలంలో విశేష స్పందన లభిస్తుంది. మండలంలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరాల్లో స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొని ప్రజలకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. సాధారణ వ్యాధులకు సంబంధించి మందులు అక్కడే అందిస్తున్నారు. చికిత్స అవసరమైన వ్యాధులకు ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యశాలలో చికిత్స అందించే విధంగా వైద్య సిబ్బంది తగిన చర్యలు చేపడుతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సేవలతో గ్రామీణ ప్రాంత ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం మండలంలోని ఉప్పరపాలెం గ్రామం ఎంపీయూపీ స్కూల్లో నిర్వహించిన వైద్య శిబిరంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శన గ్రామస్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ కే శ్రీకాంత్, వైద్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొని ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. నెలరోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో అన్ని వ్యాధులకు చికిత్స లభించడంతోపాటు మందులు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో 459 మంది వివిధ ఆరోగ్య సమస్యలపై వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు ఎంపీడీవో తెలిపారు. వారిలో 290 మంది పురుషులు, 169 మంది మహిళలు ఉన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు, అంగన్ వాడీ కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

410 మందికి వైద్య పరీక్షలు

పెదనందిపాడు: ప్రభుత్వం అందిస్తున్న వైద్య ఆరోగ్య సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, ప్రభుత్వం అందరికి అన్ని రకాల వైద్య పరీక్షలు, మందులు ఉచితంగా పంపిణీ చేస్తుందని వైద్యాధికారి విజయరత్నకుమార్ అన్నారు. శుక్రవారం ఉదయం మండల పరిధిలోని రావిపాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ శిబిరంలో 410 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో సర్పంచ్ మొవ్వా శ్రీదేవి, వైద్యాధికారులు ఎండీ అతియా, వి.అనిల్ కుమార్, సీహెచ్‌వో ప్రసాద స్వామి, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



కొమ్మూరులో జగనన్న సురక్ష శిబిరంలో ప్రజలు

జగనన్న ఆరోగ్య సురక్షతో ఆరోగ్య భరోసా

కొమ్మూరు(కాకుమాను): జగనన్న ఆరోగ్య సురక్షతతో రాష్ట్ర ప్రజలందరు సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉంటున్నారని ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ధనం కన్నా ఆరోగ్యమే ప్రధానమని నమ్మి రాష్ట్ర ప్రజలందరికి మంచి ఆరోగ్యం అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా పాలన చేయడంతో పాటు పేద, మధ్య తరగతి ప్రజలకోసం అనేక కార్యక్రమాలు చేపడుతూ రాష్ట్ర ప్రజల మన్ననలు పొందుతున్న ఏకైక ముఖ్యమంత్రి సీఎం జగన్ అన్నారు. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చిన ప్రజలకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గేరా జ్యోతి, ఎంపీటీసీ గేరా అలేఖ్య, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల కన్వీనర్ గేరా పున్నారావు, పార్టీ జిల్లా కార్యదర్శి ముజావర్ షేక్ అసదుల్లా, మండల ప్రత్యేకాధికారిణి ప్రేమ కుమారి, తహసీల్దార్ జె.ప్రసాదరావు, ఎంపీడీఓ రామకృష్ణ, ఈఓపీఆర్డీ జవహర్ లాల నెహ్రూ, వివిధ శాఖల అధికారులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

గుంటూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని వెంగళాయపాలెం గ్రామంలో ఇంటింటి సర్వేను నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్ దుగ్గెంపూడి వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఇంటూరి అంజిరెడ్డి, వలంటీర్ హిమబిందులు గ్రామంలోని ఇంటింటికి తిరిగి ప్రజల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకున్నారు. ఈనెల 17, 19 తేదీలలో గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష మెగా మెడికల్ క్యాంపును నిర్వహించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో అన్నిరకాల వ్యాధులకు ప్రత్యేక వైద్యులు వచ్చి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగించుకుకోవాలని తెలిపారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎంపీడీసీ ఎండీ మేకతోటి దయాసాగర్

జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజల రక్ష

గుంటూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజల ఆరోగ్య రక్ష అని మచిలీపట్నం పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్ తెలిపారు. శుక్రవారం 48వ డివిజన్ రెడ్డిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చి దేశానికి మార్గదర్శకంగా నిలిచారన్నారు. ప్రతి ఒక్కరూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో కుమ్మర కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, డిప్యూటీ మేయర్ షేక్ షజిల, ఉపాధి హామీ పథకం స్టేట్ కౌన్సిల్ సభ్యుడు, దారా హేమ ప్రసాద్, అర్బన్ హెల్త్ సెంటర్ చైర్మన్ మారెళ్ళ నరసింహారెడ్డి, భూపతిరాజు, చెంచు, హనుమంత రావు, మోజెస్ భూసిరెడ్డి, గ్రామ ప్రజలు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి జగన్న ఆరోగ్య సురక్ష

గుంటూరు రూరల్: ప్రతి కుటుంబానికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఆరోగ్య భద్రతలాంటిదని గుంటూరు రూరల్ మండలం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, ఎంపీపీ పులగం దివ్యశ్రీనివాసరెడ్డిలు తెలిపారు. శుక్రవారం మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో గ్రామ సర్పంచ్ మబ్బు శిరీష ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ఆరోగ్య భద్రత కల్పించటానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో నిర్వహిస్తున్నారన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఆరోగ్యంగా జీవించాలని జగనన్న ఈ కార్యక్రమం చేపట్టటం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలు 758 మంది 685 రకాల వైద్య సేవలను పొందారు. డాక్టర్ ఝాన్సీబాయి మాట్లాడుతూ గర్భిణుల సమస్యలకు 10 మంది, స్త్రీల వ్యాధులకు 8 మంది కీళ్ళవ్యాధులకు 173 మంది, సాధారణ వ్యాధులకు 287 మంది, కంటి వైద్య సేవలు 208 మంది, పొందగా 10 కళ్ళజోళ్ళను పంపిణీ చేశారు. గ్రామంలోని విలేజ్ క్లినిక్‌కు ఎంపీపీ భర్త వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పులగం శ్రీనివాసరెడ్డి బెడ్, ఆక్సిజన్ సెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో భాగంగా డీఎంహెచ్‌వో శ్రావణ్‌బాబు, అడిషనల్ డీఎంహెచ్‌వో మన్మోహన్‌లు మెడికల్ క్యాంపును పరిశీలించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ వజ్రశ్రీ, ఎంపీడీవో ఆదినారాయణ, గుంటూరు ఈస్ట్ తహసీల్దారు నగేష్, ఆంధ్రప్రదేశ్ రోడ్డు కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి, జేసీఎస్ కన్వీనర్ దాసుపాలెం సర్పంచ్ ఎదురుపాక వెంకట్, పంచాయతీ సెక్రటరీ భూషణం, ఈవోపీఆర్డీ శ్రీనివాస్, ఉపసర్పంచ్ నామా శ్రీనివాస రావు, వంగా నవీన్‌రెడ్డి, మబ్బు సుధాకర్, సచివాలయం కన్వీనర్ వింత సుబ్బారెడ్డి, వైద్య సిబ్బంది సచివాలయ సిబ్బంది, గ్రామ పార్టీ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు .



ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

రాష్ట్రంలో విద్యా విప్లవం

– ఎంఈవో సీహెచ్ రమాదేవి



విద్యార్థిని అక్షయను అభినందిస్తున్న ఎంఈవోలు రమాదేవి, లీలారాణి తదితరులు

కొండేపాడు (ప్రత్తిపాడు): రాష్ట్రంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకువస్తున్నారని ఎంఈవో సీహెచ్ రమాదేవి అన్నారు. మండల పరిధిలోని కొండేపాడు ఎల్ఈ ప్రాథమిక పాఠశాల విద్యార్థిని దాసరి అక్షయకు మద్దిరాల నవోదయ విద్యాలయం రెండవ జాబితాలో సీటు లభించింది. ఈ సందర్భంగా హెచ్ఎం జి.చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పాఠశాలలో విద్యార్థినికి అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎంఈవో రమాదేవి, ఎంఈవో-2 లీలారాణిలు అక్షయను మెమెంటో అందజేసి అభినందించారు. హెచ్ఎం మాట్లాడుతూ ఎనభై సీట్లకు ఎనిమిది వేల మంది పరీక్ష రాశారని, వారిలో తమ పాఠశాల విద్యార్థిని సీటు సాధించడం ఆనందంగా ఉందన్నారు. గ్రామపెద్దలు దాసరి చెంచురామారావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ జి.రామయ్య, ఉపాధ్యాయులు కె.శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో అక్షయ విద్యార్థి ప్రతిభ



ప్రత్తిపాడు: తైక్వాండో పోటీల్లో అక్షయ స్కూల్ విద్యార్థి అదరగొట్టాడు. ఈ నెల 12వ తేదీన గుంటూరులోని బి.ఆర్ స్టేడియంలో జరిగిన తైక్వాండో స్కూల్ గేమ్స్‌లో అండర్ 14 కేటగిరీలో 21–23 కేజీల విభాగంలో 6వ తరగతి విద్యార్థి ఎస్. ఈశ్వర్ పవన్ తేజ ఉత్తమ ప్రదర్శన కనబరిచాడు. దీంతో ఈశ్వర్ పవన్ తేజను స్టేట్ లెవల్ టోర్నమెంట్‌కి ఎంపిక చేసినట్లు అక్షయ స్కూల్ కోచ్ వి.శ్రీకాంత్ రెడ్డి. ప్రిన్సిపాల్ శ్రీవల్లి తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాలలో శుక్రవారం సాయంత్రం విద్యార్థిని అభినందించారు.

మలినేనిలో బ్లాక్‌చైన్ టెక్నాలజీపై హ్యాకథాన్



హ్యాకథాన్‌లో విద్యార్థులతో కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్ళు

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండల పరిధిలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో బ్లాక్‌చైన్ టెక్నాలజీపై హ్యాకథాన్ నిర్వహించారు. ఈ నెల 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ఐడియా ల్యాబ్స్, ఫ్యూచర్ టెక్ వెంచర్స్ ఆధ్వర్యంలో ఐటీ, డేటా సైన్స్ మూడవ సంవత్సరం విద్యార్థినులకు 36 గంటల పాటు నిర్విరామంగా హ్యాకథాన్ జరిగింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీహబ్ వ్యవస్థాపకుడు విజయ్ బవారా, రైడర్ కంపెనీ వ్యవస్థాపకుడు జి.సూర్య, ఐడియా ల్యాబ్, ఫ్యూచర్ టెక్ వెంచర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు పంకజ్ దివాన్, ఒరాకిల్ క్లౌడ్ సర్వీసు కంపెనీ డైరెక్టర్ అలోక్ తివారీ, బిజినెస్ కన్సల్టింగ్ స్మార్ట్‌టెల్ ఏఐ కంపెనీ చైర్మన్ షీలీల్ శ్రీకాంత్‌లు హాజరయ్యారు. వినూత్నంగా ఆవిష్కరణలు చేసిన విద్యార్థులకు చైర్మన్ మలినేని పెరుమాళ్లుతో కలిసి ముఖ్య అతిథులు బహుమతులు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జె.అప్పారావు, డీన్‌లు డాక్టర్ జె.కిషోర్‌బాబు, పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు



విజేతలను అభినందించిన డైరెక్టర్ సుకుమార్ బాబు అధ్యాపకులు

పొన్నూరు: వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్ పోటీల్లో జిల్లా స్థాయి విజేతలైన పొన్నూరు వివేక హైస్కూల్ విద్యార్థులకు శుక్రవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 11న తెనాలిలో ఫెడరేషన్ గేమ్స్ ఆఫ్ ఇండియా నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ జిల్లా పోటీలలో వివేకా జూనియర్ కళాశాల విద్యార్థిని మైలా తేజస్విని అండర్ 17 క్యాటగిరీ వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ విభాగాలలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. డిసెంబర్‌లో జరగనున్న సౌత్ ఇండియన్ స్కూల్ ఫెడరేషన్ పోటీల్లో తేజస్విని అర్హత దక్కించుకుంది. అక్టోబర్ 7న చిలకలూరిపేట ఏఎంజీ స్కూల్ ఆవరణలో జరిగిన అండర్ 17 బాలిక విభాగంలో 76 కేజీల విభాగంలో కూడా తేజస్విని ప్రథమ స్థానం సాధించి స్టేట్ మీట్‌కు సెలెక్ట్ అయింది. బాక్సింగ్ పోటీలలో వివేకా హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న పసుపులేటి భరత్ 44 కేజీల కేటగిరీలో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచి స్టేట్ మీట్‌కు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా వివేక విద్యాసంస్థల డైరెక్టర్ ఉప్పల సుకుమార్ బాబు విజేతలిద్దరికీ మెడల్, ట్రోఫీలతో పాటు ప్రోత్సాహక నగదు బహుమతిని కూడా అందించి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ బోసు, హైస్కూల్ ఇన్‌చార్జ్ సుబ్బారావు, పీఈటీ శ్రీనివాస రావు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వివా వీవీఐటీకి చేరుకున్న ఇండియన్ నేవీ కారు యాత్ర



నంబూరు వీవీఐటీకి చేరుకున్న ఇండియన్ నేవీ బృందంతో చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, తదితరులు

పెదకాకాని: భారతదేశ వాణిజ్య రంగంలో 70 శాతం వాటా కలిగిన జల రవాణాకు భారత నేవీ రక్షణ కల్పిస్తుందని లెఫ్టినెంట్ కమాండర్ దీపక్‌యాదవ్ అన్నారు. నావికాదళ దినోత్సవం పురస్కరించుకొని తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కారు ర్యాలీ ది ఈస్టర్న్ యార్క్ శుక్రవారం మండలంలోని వివా, వీవీఐటీ సంస్థల వద్దకు చేరుకుంది. విశాఖపట్నం నుంచి కన్యాకుమారి వరకూ 16 మంది నావికాదళ సభ్యులతో సాగుతున్న ఈ ర్యాలీ బృందానికి వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లెఫ్టినెంట్ కమాండర్ దీపక్‌యాదవ్ మాట్లాడుతూ దేశ రక్షణతో పాటు మాదక ద్రవ్యాలు, అక్రమ ఆయుధాల రవాణా నియంత్రణలో భారత నేవీ ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు. సాంకేతిక రంగంలో అత్యున్నత ప్రమాణాలతో కూడిన ఉన్నత విద్య, ఉపాధి కల్పనను భారత నావికాదళం అందిస్తుందన్నారు. భారత నావికాదళం యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలకు సంబంధించిన నోటిఫికేషన్‌లు తెలుసుకోవచ్చన్నారు. చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ జెండా ఊపి ర్యాలీని పునఃప్రారంభించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వై మల్లికార్జునరెడ్డి, వివా డైరెక్టర్ ఎల్‌టీ కమాండర్ కె.శ్రీనివాసరావు, వివా ప్రిన్సిపాల్ సీహెచ్ సరళ, ఎన్‌సీసీ ఆఫీసర్ సయ్యద్ బిబన్ బాషా, డాక్టర్ ఎ.శ్రీవాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతులు పంట నమోదు సకాలంలో చేయించుకోవాలి

పొన్నూరు: రైతులు పంట నమోదును చేయించుకొని ప్రభుత్వం అందించే ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు బొద్దులూరి రంగారావు అన్నారు. శుక్రవారం మండలంలోని ములుగు గ్రామంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. పలువురు రైతులు మాట్లాడుతూ తమలపాకు సాగుకు ఖర్చు ఎక్కువ అవుతున్నందున సాగు ఖర్చులో కొంత ప్రభుత్వం రాయితీ కల్పించాలని కోరారు. సహాయ వ్యవసాయ సంచాలకులు వి.రామకోటేశ్వరి మాట్లాడుతూ కౌలుదారులకు గ్రూపుల ద్వారా పంట రుణాలు అందించే అవకాశం ఉందని రైతులందరూ సద్వినియోగపరచుకోవాలని తెలిపారు. సమావేశంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ లంకపోతుల పిచ్చిరెడ్డి, సర్పంచ్, ఎంపీటీసీ, రైతు భరోసా కేంద్రం సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

వరల్డ్ టాప్ సైంటిస్ట్‌లలో విజ్ఞాన్ అధ్యాపకులకు చోటు



అధ్యాపకులతో విజ్ఞాన్ చైర్మన్ లావు రత్తయ్య

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకి చెందిన ఏడుగురు అధ్యాపకులు వరల్డ్ టాప్ 2% సైంటిస్ట్‌లలో చోటు సాధించారని శుక్రవారం వైస్ చాన్స్‌లర్ పీ నాగభూషణ్ తెలిపారు. అమెరికాలోని కాలిఫోర్నియా ప్రాంతంలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ నిర్వహించిన సర్వేలో విజ్ఞాన్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్లు అంబటి రంగారావు, కే చంద్రశేఖర్, పీటే అబ్రహం, కే వెంకటరావు, కే బాలమురుగన్, రుద్రపాల్ మిథున్, టీ సుబ్బయ్యలు వరల్డ్ టాప్ 2% సైంటిస్ట్‌లలో నిలిచారని తెలిపారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ 2022 వరకు ఉన్న ఉత్తమ సైంటిస్ట్‌ల డేటాను తీసుకోవడంతో పాటు స్టాండర్డ్ సైన్స్ మేట్రిక్స్ క్లాసిఫికేషన్‌లో గల 22 సైంటిఫిక్ ఫీల్డ్స్, 174 సబ్ ఫీల్డ్స్‌ను పరిగణలోనికి తీసుకుని ఈ ఫలితాలను వెల్లడించినట్లు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ప్రొఫెసర్‌లను చైర్మన్ లావు రత్తయ్య అభినందించారు.

చేతుల శుభ్రత.. ఆరోగ్యానికి భద్రత

ప్రత్తిపాడు: ఈ నెల 15వ తేదీన అంతర్జాతీయ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని (గ్లోబల్ హ్యాండ్ వాష్ డే) పురస్కరించుకుని యునిసెఫ్ ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ, పారిశుద్ధ్య విభాగాల ఆధ్వర్యంలో పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు చేతిని సబ్బుతో కడుక్కోవలసిన ఆవశ్యకత, ఉపయోగాలు, నష్టాలను ప్రయోగాత్మకంగా వివరిస్తున్నారు. నేను నా సంపూర్ణ ఆరోగ్య సంరక్షణలో.. అంటూ ప్రత్యేక ప్రతిజ్ఞలనూ చేయిస్తున్నారు.

రేపు శేకూరులో బజరంగ్ నేత్ర జ్యోతి కార్యక్రమం



బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ

కొరిటిపాడు(గుంటూరు): బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చేబ్రోలు మండలం, శేకూరు గ్రామంలో బజరంగ్ నేత్ర జ్యోతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ తెలిపారు. పట్టాభిపురంలోని బజరంగ్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యవంతమైన జీవితం ప్రతి ఒక్కరికీ దక్కాలనే మానవీయ కోణంతో 'సర్వేంద్రియాణం నయనం ప్రధానం' అనే సూక్తి స్ఫూర్తిగా నేత్ర జ్యోతి పేరుతో పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాన్ని బజరంగ్ ఫౌండేషన్ కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. రంగుల ప్రపంచాన్ని సాక్షాత్కారం చేసే కంటిచూపును తిరిగి పొందిన వారి కళ్లలో కనిపించే సంతృప్తి ముఖ్యమనిచ పేర్కొన్నారు. రైతులు, రైతు కూలీలు, వెనుకబడిన వర్గాలు, హరిజన, గిరిజన, బడుగు బలహీన వర్గాలు, మైనార్టీ ప్రజలు అధికంగా ఉన్న చేబ్రోలు మండలంలోని శేకూరు, వీరనాయకునిపాలెం, పెదకాకాని మండలంలోని అనుమర్లపూడి, తంగెళ్లమూడి గ్రామాల ప్రజలకు శేకూరు కేంద్రంగా నేత్ర జ్యోతి శిబిరాన్ని ఏర్పాటు చేయడం వెనుక జగనన్న సంక్షేమ స్ఫూర్తి దాగి ఉందన్నారు. కుల, మత, వర్గ, వర్ణ, రాజకీయాలకు అతీతంగా జరిగే ఈ శిబిరం ద్వారా నేత్ర సమస్యల నుంచి యా గ్రామస్తులందరికీ రక్షణ కల్పించడమే లక్ష్యంగా ఉంటుందని తెలిపారు. కంటి సమస్య ఉన్నట్లు గుర్తించిన వారికి 7 రోజుల్లోగా కళ్ళ జోళ్లను అందించడం జరుగుతుందని చెప్పారు. బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో చేపడుతున్న ప్రతి సేవా కార్యక్రమాన్ని ద్విగ్విజయంగా పూర్తి చేసి, ఈ సేవా పరంపర సత్ఫలితాలను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు. గతంలో లంక గ్రామాలు, తీర ప్రాంత గ్రామాల్లోని గంగపుత్రులు, మత్స్యకార కుటుంబాలే లక్ష్యంగా నిర్వహించిన నేత్రజ్యోతి శిబిరాలకు అనూహ్య రీతిలో స్పందన లభించిందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు సుమారు 8 వేల మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి, 5 వేల మందికి కళ్ళజోళ్లు అందించడం జరిగిందని వివరించారు. శేకూరు, పరిసర గ్రామాల ప్రజల కోసం జరుగుతున్న ఈ కార్యక్రమంలో కళ్ళజోళ్లు అవసరమైన వారికి కేవలం 7 పనిదినాలలో గ్రామంలోనే కళ్ళజోళ్ల పంపిణీ జరుగుతుందని ఆయన వెల్లడించారు.

కిట్స్ కళాశాలలో 36 గంటల హ్యాకథాన్



సర్టిఫికెట్లు అందజేస్తున్న కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులు

ప్రత్తిపాడు: సరికొత్త ఆలోచనలతో వినూత్న ఆవిష్కరణలు చేయడం ద్వారా యువతలో మేధో శక్తి పెరుగుతుందని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు అన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఐటీ చివరి సంవత్సరం విద్యార్థులకు మేక్ స్కిల్ కంపెనీ ప్రతినిధుల ఆధ్వర్యంలో 36 గంటల స్మార్ట్ కాంట్రాక్ట్ సమ్మిట్ హ్యాకథాన్‌ను నిర్వహించారు. హ్యాకథాన్‌లో మొత్తం 37 టీమ్‌లు పాల్గొన్నాయి. పేపర్ మీడియా, బర్త్ రిజిస్టరీ యూజింగ్ బ్లాక్ చైన్, స్మార్ట్ టెండరింగ్–బ్లాక్ చైన్, సీమ్ లెస్ గవర్నమెంట్ జాబ్ వెరిఫికేషన్ వయా ఆధార్, ఆర్గానిక్ ఫుడ్ చైన్ ఐడియాలు వంటి పలు వినూత్న ఆవిష్కరణలను ప్రదర్శించారు. సాఫ్ట్‌వేర్ కంపెనీలకు చెందిన జ్యూరీ ప్రతినిధులు లోకేష్ కుమార్, లోకేష్ వంకల ఆవిష్కరణలను పరిశీలించారు. అనంతరం ఐటీ విభాగాధిపతి డా. యం.ఎ స్.ఎస్. సాయి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ హ్యాకథాన్‌లో విద్యార్థులు చేసే ఆవిష్కరణలు సమాజానికి ఉపయోగకరంగా ఉండాలన్నారు. కళాశాల సెక్రటరీ కోయి శేఖర్ సాంకేతిక రంగంలో ఆవిష్కరణల ప్రాముఖ్యత, విద్యార్థుల పాత్రను వివరించారు. ప్రిన్సిపాల్ డా. పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డా. కె.హరిబాబులు మాట్లాడుతూ ప్రస్తుత విద్యార్థులకు బ్లాక్ చైన్ సాంకేతికత మంచి ఉద్యోగ అవకాశాలను కల్పించడమే కాకుండా స్టార్టప్ కంపెనీలను స్థాపించటంలో కూడా ప్రముఖ పాత్ర వహిస్తుందని తెలియజేశారు. మేక్ స్కిల్ సీఈఓ పర్వతనేని మధుతో పాటు హ్యాకథాన్ జ్యూరీ మెంబర్స్‌ను కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

కళ్లం కళాశాలలో అమృత్ కలశయాత్ర



పంచప్రాణ్ ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ఆజాదీ కా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు శుక్రవారం కళ్ళం ఇంజనీరింగ్ కళాశాలలో అమృత్ కలశయాత్రను నిర్వహించటం జరిగిందని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్స్ ద్వారా గ్రామాల నుంచి బియ్యం, మట్టిని సేకరించి కళాశాలలో కలశాల్లో నింపటం జరిగిందన్నారు. అనంతరం పంచప్రాణ్ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, ఏవో నవ్య, డి.శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ పీఎల్ మాధవరావు తదితరులున్నారు.